(PRGI NO: APTEL / 2023 / 88653)
పబ్లిక్ వ్యూ
తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికారంగంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న పబ్లిక్ వ్యూ తెలుగు దినపత్రికకు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రిపోర్టర్లు కావలెను.

మీ రెజ్యూమ్ కింద వాట్సాప్ నెంబర్ కు పంపండి
9701132982

(PRGI NO: APTEL / 2023 / 88653)

# పబ్లిక్ వ్యూ

తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

సంపుటి : 2 సంచిక : 238 పేజీలు :8 సంపాదకులు : చిరికి లోకేశ్వరరావు ప్రచురణ : అనకాపల్లి ఆదివారం 17 మే 2026 వెల : 5/-రూ॥

VOLUME :2 ISSUE :238 PAGES :8 EDITOR : CHIRIKI LOKESWARA RAO PUBLISHED FROM :ANAKAPALLI SUN 17 MAY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Kakinada,Eluru,Vijayawada,Guntur, Ongole, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

### పార్టీలో ఉండాలనుకునే వారు ఉండొచ్చు..

## వద్దనుకుంటే వెళ్ళవచ్చు

- టీఎంసీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులతో మమతా బెనర్జీ భేటీ
- పార్టీ తిరిగి పుంజుకుంటుందని మమతా బెనర్జీ ధీమా
- టీఎంసీ ఎప్పటికీ తలవంచదన్న మమతా బెనర్జీ



పబ్లిక్ వ్యూ డెస్క్:పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నిక ల ఫలితాల తర్వాత, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు తలెత్తాయనే ఊహాగా నాలు వినిపించాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారని తెలుస్తోంది. పార్టీలో ఉండాలనుకునే వారు ఉండవచ్చని, వద్దనుకునే వాళ్ళు వెళ్ళిపోవచ్చని ఆమె స్పష్టంగా చెప్పినట్లు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్‌లోని తన నివాసంలో మమతా

- మిగతా 2లో

### ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం..

## నారా లోకేష్ దిగ్భ్రాంతి

- కాకినాడ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ప్రమాదం
- రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టిన టిప్పర్
- అక్కడికక్కడే నలుగురు మహిళలు దుర్మరణం
- వాహనాన్ని వదిలేసి పరారైన డ్రైవర్
- మహిళల మృతి తనను కలచివేసిందన్న లోకేష్



పబ్లిక్ వ్యూ డెస్క్:కాకినాడ రూరల్ పరిధిలోని కొవ్వూరు బ్రిడ్జి సమీపంలో ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చీడగ గ్రామానికి చెందిన కొందరు మహిళా కూలీలు ఉపాధి హామీ పనుల కోసం కాలినడకన రోడ్డు దాటుతుండగా, కాకినాడ వైపు నుంచి అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో తీవ్ర రక్తస్రావమై సత్యవతి, కృష్ణవేణి, చిట్టెమ్మ, అన్నవరం అనే నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం

- మిగతా 2లో



## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

- నకిలీ, బోగస్ డిగ్రీలతో వృత్తిలోకి ప్రవేశించే వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించినట్లు వెల్లడి
- కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన
- భారత యువత పట్ల తాను గర్వపడుతున్నానన్న జస్టిస్ సూర్యకాంత్

- మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

- మొన్న లీటర్‌పై రూ.3 పెంపు
- సమీప భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం
- దశలవారీగా రూ.10 పెంచే అవకాశం

- మిగతా 2లో

## తమిళనాడు సీఎం వద్ద హోం, యువజన సంక్షేమం.. మంత్రులకు శాఖల కేటాయింపు



- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను అట్టిపెట్టుకున్న సీఎం
- ఎన్.ఆనంద్‌కు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కేటాయింపు
- అదవ అర్జునకు పబ్లిక్ వర్క్స్, క్రీడల అభివృద్ధి శాఖలు

తమిళనాడు ముఖ్యమంత్రికి, ఇతర మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం ప్రకటన విడుదల చేసింది. విజయ్ ముఖ్యమంత్రిగా ఈ నెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు లోక్ భవన్ శాఖలను కేటాయించింది. ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను అట్టిపెట్టుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు... పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను

- మిగతా 2లో



## విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా.. సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది

- నెదర్లాండ్స్ లోని ది హేగ్ లో ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మోదీ
- ఆర్థిక, సాంకేతిక రంగాలలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- సెమీకండక్టర్ల తయారీ రంగంలో వేగంగా ముందడుగు వేస్తున్నామన్న ప్రధాని

భారతదేశం ప్రస్తుతం ఆర్థిక, సాంకేతిక రంగాలలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా 'ది హేగ్' నగరంలో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం సాధిస్తున్న

- మిగతా 2లో

## నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం



- పరిశుభ్రత, పేదరిక నిర్మూలన, జనాభా పెరుగుదల, భూ రికార్డుల ప్రక్షాళనే తన ప్రాధాన్యతలని స్పష్టం చేసిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు
- ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవద్దు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలన్నదే తన సంకల్పమని వెల్లడి
- గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, విధ్వంసానికి, అభివృద్ధికి ఉన్న తేడాను గమనించాలని ప్రజలకు పిలుపు
- నరసన్నపేట నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులను మంజూరు చేస్తూ వేదికపై నుంచే హామీ

- మిగతా 2లో

## కూటమి పాలనలో అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయి



- కూటమి పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్న జగన్
- రాష్ట్రం అభివృద్ధి చెంది ఉంటే రెవెన్యూ కూడా పెరగాలి కదా అని ప్రశ్న
- ఆదాయం తగ్గిపోవడాన్ని ప్రభుత్వం సంపద సృష్టి అని ఎలా పిలుస్తుందన్న జగన్

పబ్లిక్ వ్యూ డెస్క్:కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. పాలనలో కేవలం అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయని విమర్శించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 10.75 శాతంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, ఒకవేళ అదే నిజమైతే ప్రభుత్వ ఆదాయ వృద్ధి రేటు ఎందుకు 3.22 శాతానికి పడిపోయిందని జగన్ ప్రశ్నించారు. రాష్ట్రం నిజంగానే అభివృద్ధి చెందితే, దానికి అనుగుణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా పెరగాలి కదా అని ఆయన నిలదీశారు.వైసీపీ పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా రాష్ట్రానికి రూ. 85,922.23 కోట్ల ఆదాయం వచ్చిందని జగన్ గుర్తుచేశారు. గడిచిన రెండేళ్లలో సాధారణంగా ఉండాల్సిన 8 శాతం వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకున్నా, 2025-26 నాటికి ఈ పన్నుల ఆదాయం రూ. 1,00,219.69 కోట్లకు చేరాల్సి ఉందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో వాస్తవంగా వచ్చింది కేవలం రూ. 86,552.68 కోట్లు మాత్రమేనని చెప్పారు. ఈ లెక్కల ప్రకారం అంచనాల కంటే దాదాపు రూ. 13,667 కోట్ల మేర రాష్ట్ర ఆదాయం తగ్గిపోవడాన్ని చంద్రబాబు ప్రభుత్వం 'సంపద సృష్టి' అని ఎలా పిలుస్తుందని జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు.



## పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడానికి కాదు..

### ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

పబ్లిక్ వ్యూ డెస్క్:జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు ఘాటు విమర్శ లు చేశారు. పవన్ తన పార్టీని సీఎం అవ్వడానికి పెట్టలేదని,

- మిగతా 2లో

## మోదీ పొదుపు పిలుపు.. మహానాడును ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్న కొల్లు రవీంద్ర

- ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని టీడీపీ పొదుపు చర్యలు
- మహానాడు కార్యక్రమం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి పరిమితం
- నియోజకవర్గాల్లో క్లస్టర్ల వారీగా పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తామన్న కొల్లు రవీంద్ర



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పొదుపు పిలుపునకు అనుగుణంగా, తెలుగుదేశం పార్టీ 'మహానాడు' కార్యక్రమాన్ని ఈసారి పూర్తిగా ఆన్‌లైన్ (డిజిటల్) పద్ధతిలో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు

- మిగతా 2లో

# రాయల్ ఎన్ ఫీల్డ్ బండెక్కిన చంద్రబాబు..

శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన సీఎం చంద్రబాబు

'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి

పోలీసులు ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్‌కు ప్రశంసలు

హెల్మెట్ ధరించి రాయల్ ఎన్ ఫీల్డ్ బైక్‌పై కూర్చున్న చంద్రబాబు

సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అందరినీ ఆశ్చర్యపరిచారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో భాగంగా ఆయన హెల్మెట్ ధరించి, రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 650 బైక్‌పై ఎక్కారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే, ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పోలీసులను అభినందించారు. అనంతరం

స్వయంగా హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై కూర్చుని యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ పర్యట నలో చంద్రబాబు వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఇతర అధికారులు ఉన్నారు. అంతకుముందు, ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని 'స్వర ఆర్ట్ గ్యాలరీ' స్టాల్‌లో గిరిజనులు రూపొందించిన ఓవర్‌కోట్‌ను కొనుగోలు చేసి అక్కడే ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి ఇలా బైక్‌పై కనిపించడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించగా, ఈ వీడియోపై నెటిజన్లు సరదాగా స్పందిస్తున్నారు.




## మోదీ పొదుపు పిలుపు.. మహానాడును ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్న కొల్లు రవీంద్ర

- మొదటి పేజీ తరువాయి

నిర్ణయించారని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా ఏర్పడిన విపత్కర పరిస్థితులు, ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు వేదికగా భారీ ఎత్తున జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి పరిమితం చేశారు. అక్కడి నుంచే పొలిట్‌బ్యూరో సభ్యులు, ముఖ్య నేతల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా ఈ వేడుకలు జరగనున్నాయి. అయితే కేడర్‌కు ఎటువంటి నిరాశ కలగకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల్లో క్లస్టర్ల వారీగా పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేసి డిజిటల్ పద్ధతిలో అందరినీ భాగస్వామ్యం చేయనున్నారు. మహానాడు తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ఈ స్క్రీన్ల ద్వారానే నాయకులకు, కార్యకర్తలకు చేరవేస్తారు. ఇదే సమయంలో ఇంధన కొరతను ఆసరాగా చేసుకుని మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలను పెంచితే సహించేది లేదని కొల్లు రవీంద్ర వ్యాపారులను హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు ఎలాంటి అభద్రతా భావానికి గురికావాల్సిన అవసరం లేదని, ధరలను అదుపు చేయడానికి ముఖ్యమంత్రి ఇప్పటికే ఒక ప్రత్యేక కమిటీని నియమించారని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో పనిచేస్తున్న ఈ కమిటీ, రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ ధరలను నిరంతరం పర్యవేక్షిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

### ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు దుర్మరణం..

## నారా లోకేష్ దిగ్భ్రాంతి

- మొదటి పేజీ తరువాయి

ఉదయాన్నే ఉపాధి పనులకు వెళుతూ నలుగురు మహిళా కార్మికులు ఇలా దుర్మరణం పాలవ్వడం తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు కూలీలను కాకినాడ సర్వజనాస్పత్రికి తరలించగా, వారికి మెరుగైన అత్యవసర వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కాకినాడ రూరల్ పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## పవన్ పార్టీ పెట్టింది సీఎం అవ్వడనికి కాదు..

## ఆ విషయం మాకు ఎప్పుడో తెలుసు

- మొదటి పేజీ తరువాయి

మరొకరిని సీఎం చేయడానికి పెట్టారని తమకు ఎప్పటినుంచో తెలుసంటూ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళ నటుడు విజయ్ ఇటీవల రాజకీయాల్లోకి వచ్చి ఒంటరిగా పోటీ చేసి గెలిచిన నేపథ్యంలో, పవన్ కూడా అలాగే గెలవాల్సిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై జనసేనాని స్పందించారు. విజయ్‌తో తనకు పోలిక లేదని, గతంలో తాను ఒంటరిగా రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అందుకే పొత్తులతో వెళ్లాల్సి వచ్చిందని ఆయన వివరించారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలనే అంబటి రాంబాబు ఆయుధంగా చేసుకున్నారు. "మీరు సీఎం కావాలని కాదు, ఎవరో సీఎం కావాలని పార్టీ పెట్టారని మాకు ఎప్పుడో తెలుసు. కానీ ఆ విషయం ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది" అని అంబటి వ్యాఖ్యానించారు. పవన్ స్వయంగా తన ఓటమిని, పొత్తుల అవసరాన్ని అంగీకరించడంతో, ఆయన రాజకీయ లక్ష్యంపై అంబటి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం మొదలైంది.

### తమిళనాడు సీఎం వద్ద హోం, యువజన సంక్షేమం.. మంత్రులకు శాఖల కేటాయింపు

- మొదటి పేజీ తరువాయి

ఆదవ్ అర్జునకు... ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు... ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ.సెంగొట్టయ్యన్‌కు అప్పగించారు. ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కు... స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు... మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు, ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను ఎస్.కీర్తనకు అప్పగించారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు

కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

### విదేశాల్లో ఉన్న విషయాన్ని మర్చిపోయా.. సొంత దేశంలో ఉత్సవానికి హాజరైనట్టుగా ఉంది

- మొదటి పేజీ తరువాయి

డిజిటల్ ప్రగతిని, ప్రవాస భారతీయుల సేవలను ఆయన కొనియాడారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల రంగంలో భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని గర్వంగా ప్రకటించారు. దేశంలో ఇప్పుడు నెలకు ఏకంగా 20 బిలియన్ డాలర్ల మేర డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతిక రంగంలో మన దేశం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో కేవలం 4 యూనికార్న్ స్టార్టప్ సంస్థలు మాత్రమే ఉండేవని, కానీ నేడు వాటి సంఖ్య 100కు చేరిందని గుర్తుచేశారు. భవిష్యత్తు సాంకేతికతకు అత్యంత కీలకమైన సెమీకండక్టర్ల తయారీ రంగంలోనూ భారత్ వేగంగా ముందడుగు వేస్తోందని, దానికి సంబంధించిన పనులు క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లో ఉన్న భారతీయుల ప్రేమ, ఉత్సాహాన్ని చూస్తుంటే తాను విదేశంలో ఉన్నాననే సంగతి మర్చిపోయానని, సొంత దేశంలో ఏదో ఉత్సవానికి హాజరైనట్లు అనిపిస్తోందని ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు. నెదర్లాండ్స్ నాయకత్వం ఎప్పుడు కలిసినా అక్కడి భారతీయ సమాజం చూపిస్తున్న ప్రతిభను, క్రమశిక్షణను ప్రశంసిస్తూనే ఉంటుందని చెప్పారు. తరాలు మారి, దేశాలు మారినా భారతీయులు తమ కుటుంబ విలువలను, సాంప్రదాయాలను ఎప్పటికీ వదులుకోలేదని కొనియాడారు. ప్రపంచంలో ఎన్నో సంస్కృతులు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ ప్రవాసుల హృదయాల్లో బలంగా సజీవంగా ఉందనడానికి ఈ సభే నిదర్శనమన్నారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో దశాబ్దాల తర్వాత ఒక సంపూర్ణ మెజారిటీ కలిగిన స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయులు తనపై ఉంచిన నమ్మకమే దేశాభివృద్ధి కోసం తనను ఆగనివ్వకుండా, అలసిపోనివ్వకుండా ముందుకు నడిపిస్తోందని మోదీ ఎమోషనల్ అయ్యారు.

# సంపాదకీయం

## పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.10 పెరిగే అవకాశం!

భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పైన రూ.10 వరకు పెరిగే అవకాశముందని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ఈ పెంపు ఒకేసారి లేదా దశలవారీగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెంచుతూ శుక్రవారం భారత చమురు రంగ కంపెనీలు నిర్ణయించాయి. సమీప భవిష్యత్తులో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తత కారణంగా రాబోయే రోజుల్లో అంతర్జాతీయంగా ఇంధన ధరలు భారీగా పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో చమురు కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాల నుంచి బయటపడేందుకు రూ.3 పెంచాయని, కానీ ఈ పెంపు చాలదని ఎంకే గ్లోబల్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు మూడు వారాల్లో దశలవారీగా పెరుగుదల ఉండవచ్చని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును దాదాపు నిలిపివేసింది. ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కూడా లాభాలను వదులుకుని అధిక వ్యయాన్ని భరించాయి. ఇలాంటి పరిస్థితుల్లో కంపెనీలు ఇంధన ధరలు పెంచుతున్నాయి. నిన్న పెరిగిన స్వల్ప పెరుగుదల కూడా కంపెనీల రోజువారీ నష్టాలను కొంతమేర తగ్గించిందే తప్ప తొలగించలేదు.

## పార్టీలో ఉండాలనుకునే వారు ఉండొచ్చు.. వద్దనుకుంటే వెళ్ళవచ్చు

- మొదటి పేజీ తరువాయి

బెనర్జీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ పార్టీ తిరిగి పుంజుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మారాలనుకునే వారిని వెళ్ళనీయండని, కానీ పార్టీని కొత్తగా నిర్మిస్తానని ధీమా వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించాలని సూచించారు. వాటికి రంగులు వేద్దామని, అవసరమైతే తాను కూడా వేస్తానని తెలిపారు. టీఎంసీ ఎప్పటికీ తలవంచదని అన్నారు. ప్రజల తీర్పును వారు దొంగిలించారని విమర్శించారు.

## నా జీవితాశయం ఇదే.. ఈ నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రభుత్వ దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. తన మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలే రాష్ట్ర భవిష్యత్తుకు మూలస్తంభాలని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర', పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలు, జనాభా సమతుల్యత, భూ రికార్డుల ప్రక్షాళన తన జీవితాశయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

**నా జీవితాశయం ఇదే.. నాలుగు కార్యక్రమాలే నా ప్రాధాన్యం**

ప్రజల అభిమానాన్ని చూస్తుంటే ఎంత కష్టపడినా తక్కువేననిపిస్తోందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "నా మనసుకు దగ్గరైన నాలుగు కార్యక్రమాలు ఉన్నాయి. మొదటిది రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర. రెండోది నెల మొదటి తారీఖున పేదలకు పింఛన్లు అందించి వారి బాగోగులు తెలుసుకోవడం. మూడోది జనాభా నియంత్రణ పేరుతో గతంలో జరిగిన పొరపాటును సరిదిద్ది, పిల్లల్ని సంపదగా భావించడం. అందుకే మూడో బిడ్డకు రూ.30,000, నాలుగో బిడ్డకు రూ.40,000 అందిస్తున్నాం. నాలుగోది, గొడ్డలి పార్టీ నాశనం చేసిన భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో ప్రక్షాళన చేసి, 2027 మార్చి నాటికి భూతగాదాలు లేని రాష్ట్రంగా మార్చడం" అని తన లక్ష్యాలను వివరించారు.

**స్వచ్ఛాంధ్ర ఉద్యమం.. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 17వ సారి నిర్వహిస్తున్నామని, దీని ద్వారా రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. "స్వచ్ఛత అంటే రోడ్లు, ఇళ్లు శుభ్రంగా ఉండటమే కాదు, మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను క్లియర్ చేయడానికి 23 నెలలు పట్టింది. జూన్ నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చేసే బాధ్యత మాది" అని హామీ ఇచ్చారు.

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు, వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం', పాఠశాలల్లో 'నెట్ జీరో' విధానం వంటి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

**ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలసలు రావాలి**

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ఒకప్పుడు దేశంలో ఏ నగరానికి వెళ్లినా శ్రీకాకుళం కాలనీ ఉండేది. ఈ పరిస్థితి మారాలి. ఉత్తరాంధ్ర నుంచి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు రావాలి. ఇదే నా సంకల్పం" అని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఉత్తరాంధ్ర దశ, దిశ మారుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన మధ్యవలస స్టేజ్-2, హీరమండలం ఎత్తిపోతల, వంశధార, జంఝావతి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని క్యాలెండర్ ప్రకటించారు. 60 ఏళ్ల కల అయిన నేరేడి బ్యారేజ్‌ను ఈ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**అవార్డుల అభినందనలు.. నరసన్నపేటకు వరాలు**

జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా నిలిచి అవార్డులు సాధించిన అధికారులను, ప్రజాప్రతినిధులను చంద్రబాబు వేదికపై నుంచి అభినందించారు. దేశంలోనే 8 అవార్డులు సాధించి పంచాయతీరాజ్ శాఖ నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రమణమూర్తి విజ్ఞప్తి మేరకు, నరసన్నపేటలోని రాజుల చెరువు ఆధునికీకరణ, ఓల్డ్ ఎన్హెచ్ రోడ్డు విస్తరణ, శ్రీముఖలింగం ఆలయ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం వంటి పలు అభివృద్ధి పనులకు అక్కడికక్కడే ఆమోదం తెలిపారు. ఎర్రన్నాయుడు పార్క్ కేసును పరిష్కరించే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించారు.

**లెక్కలతోనే నా పాలన.. అధికారులకు మార్కులు, క్లాసులు**


తన ప్రసంగంలో భాగంగా ముఖ్యమంత్రి, శ్రీకాకుళం జిల్లా అధికారుల పనితీరుపై డేటాతో సహా సమీక్ష నిర్వహించారు. "50 ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి రాష్ట్ర సగటు 72.96% ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో 75.2% ఉండటం అభినందనీయం" అని కలెక్టర్‌ను, అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. రీ-సర్వే, తాగునీరు, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ వంటి విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన వారిని అభినందిస్తూనే, ఆర్టీసీ బస్ సర్వీసులు, గంజాయి నియంత్రణ, సీఎం రిలీఫ్ ఫండ్ అమలులో వెనుకబడిన శాఖల అధికారులను హెచ్చరించారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**గొడ్డలి పార్టీతో జాగ్రత్త.. విధ్వంసం, అభివృద్ధికి తేడా ఇదే**

గత ప్రభుత్వ పాలనను 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "అధికారం అంటే విధ్వంసం కాదు, ప్రజల జీవితాలను మార్చే అవకాశం. గత ఐదేళ్లు ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, అరాచకాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడింది. బాబాయ్‌ని గొడ్డలితో చంపి, ఆ నింద నాపై వేసి ఎన్నికల్లో గెలిచారు. అలాంటి వారి కొత్త నాటకాలతో మళ్లీ వస్తారు, జాగ్రత్తగా ఉండాలి" అని ప్రజలను హెచ్చరించారు. విధ్వంసానికి, అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను గమనించి, రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం

**యలమంచిలి ( పబ్లిక్ వ్యూ) మే : 16.**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం జరిగే కార్యక్రమంలో మే నెల థీమ్ అయినటువంటి ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ – అనే అంశంపై స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శనివారం స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్, మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బందితో స్థానిక మున్సిపల్ ఆఫీస్ నుంచి వెజిటబుల్ మార్కెట్ మీదుగా మెయిన్ రోడ్, భవనం వీధి ప్రాంతాలలో ప్లాస్టిక్ రహిత ఆంధ్ర ప్రదేశ్ అనే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ, ప్లకార్డ్స్, స్లోగన్లతో నిర్వహించారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం అమలులో సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నిషేధించి గుడ్డ సంచులను ఇతర ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ని అమ్మినా, వినియోగించిన కూడా చట్టరీత్యా జరిమానాలు విధించబడతాయని తెలియజేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి అక్కడి స్థానిక వర్తకులు, ప్రజలు మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బందిచే కమిషనర్ స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించడం జరిగిందని అన్నారు. అనంతరం 13 సచివాలయాల పరిధిలో




ఉన్న వార్డులలో పై పేర్కొన్న అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ బి జె ఎస్ ప్రసాదరాజు, తాసిల్దార్ వరహాలు, మున్సిపల్ మేనేజర్ విజయకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సి ఎం ఎం పద్మావతి, మెప్మా సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానిక వర్తకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రెగ్యులర్ చేయండి

ఎంటీఎస్ ఉపాధ్యాయ రాష్ట్రకార్యదర్శి కామేష్ రెడ్డి



**శ్రీకాకుళం(పబ్లిక్ వ్యూ)మే16:** రాష్ట్రవ్యాప్తంగా1998 ఎంటిఎస్ 4072 మంది ఉపాధ్యాయులును రెగ్యులర్ చేయాలని,62 సంవత్సరాల వయస్సు పొడిగింపు,12 నెలల జీతం చెల్లిశీచాలని కోరుకుంటూ శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట విచ్చేసిన ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు కి పీజీఆర్ఎస్ ద్వారా సమస్య తెలియజేసిన రాష్ట్ర ఎంటిఎస్ ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి.

## రాష్ట్ర వైఎస్ఆర్సిపి పార్టీ జాయింట్ సెక్రటరీగా బొద్దపు ఎర్రయ్య దొర.




**ఎలమంచిలి ( పబ్లిక్ వ్యూ) మే : 16.** రాష్ట్ర వైఎస్ఆర్సిపి పార్టీ జాయింట్ సెక్రెటరీ బొద్ధపు ఎర్రయ్య దొరను నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ నమ్ముకుని విశేష సేవలు అందిస్తున్న వ్యక్తి అని పార్టీ కి విశేష సేవలు అందిస్తూ నిరంతరం శ్రమిస్తూ ఉన్నటువంటి వ్యక్తి బొద్ధపు ఎర్రయ్య దొర అని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మరియు అధిష్టానం గుర్తించి శనివారం తాడేపల్లి పార్టీ కార్యాలయం లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు .కార్యకర్తలు. శ్రేయోభిలాషులు ఎర్రయ్య దొరకి శుభాకాంక్షలు తెలిపారు.

## చలనం లేని అధికారులు...భయం లేని ఇసుకాసురులు...







**చోడవరం (పబ్లిక్ వ్యూ )మే 16:**చోడవరం మండలం జుత్తాడ గ్రామంలో ఇసుకాసురులు ఏ మాత్రం అధికారులకు కూడా భయపడకపోవడం మండలం లో చర్చనీయం గా మారింది...

స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ హెచ్చరించినా ఇసుక చెక్ పోస్ట్ ను తొలగించకపోగా..

10 లక్షల కు వేలం పాట నిర్వహించిన స్థానిక జనసేన నేత ఎవరూ తమను ఆపలేరని, త్వరలోనే రెవెన్యూ ఆఫీసర్ ను సైతం బదిలీ చేయించగలనని పలువురితో అనడం ఇసుకాసురుల బరితెగింపుకు నిదర్శనం గా మారింది...

మరి రెవెన్యూ అధికారులు 10 లక్షలకు ఇసుక వేలం నిర్వహించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిదల్సిందేనని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు...



## వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి.!నలుగురికి తీవ్ర గాయాలు..



**నక్కపల్లి (పబ్లిక్ వ్యూ) మే 16** నక్కపల్లి జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి చెందగా నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నక్కపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సిక్కోలు రాజు, గొడుగు థామస్, బద్ద పండు ముగ్గురు కలిసి ఎస్. రాయవరం మండలం అడ్డు రోడ్డు వద్దకు బైకుపై వెళ్లి తిరిగి నక్కపల్లి వైపు వస్తుండగా నక్కపల్లి ఫైర్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఆకస్మాత్తుగా రోడ్డుపై లారీ నిలిపివేయడంతో ఒక్కసారిగా వీరు నడుపుతున్న బైకు ఢీకొట్టింది. బైకు ఢీకొట్టిన సందర్భంలో తీవ్ర గాయాలైన చిక్కోలు రాజు( 22) ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. గొడుగు దామస్ ,బద్ద పండు తీవ్రంగా గాయపడ్డారు .ప్రమాద సంఘటన విషయాన్ని తెలుసుకున్న స్థానికులు తో పాటు సీఐ జూరెడ్డి మురళి, ట్రాఫిక్ సిబ్బంది చేరుకొని హుటా హుటిన నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స చేసిన వైద్యులు కాకినాడ జిల్లా తుని ప్రైవేట్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆ ప్రమాదం జరిగిన సందర్భంలో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ జూరెడ్డి మురళి రంగంలో దిగి సాటి సిబ్బందితో కలసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఎస్ రాయవరం మండలం అడ్డురోడ్ నుంచి బైక్ పై నక్కపల్లి వైపు వస్తున్న ఇరువురు యువకులు వారి నడుపుతున్న బైకు అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తరలించి చికిత్స అందించిన అనంతరం తుని ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులుగా “బచ్చల”

**నక్కపల్లి, (పబ్లిక్ వ్యూ) మే 16** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నక్కపల్లి మండల యూత్ అధ్యక్షులుగా ప్రస్తుత మండలంలోని ఉద్దండ పురం ఎంపీటీసీగా ఉన్న బచ్చల రాజును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో శనివారం ప్రకటించారు. మండల యువత అధ్యక్షులుగా బచ్చల రాజు ఎంపిక పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నక్కపల్లి మండలంలో యువతను సన్నద్ధం చేసేందుకు పెద్ద ఎత్తున పార్టీ నాయకత్వంతో కలిసి పని చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనకి మండల అధ్యక్ష పదవి ప్రకటించిన పట్ల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, మాజీమంత్రి, కురసాల కన్నబాబు, మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్ ,అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ , పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి కంబాల జోగులు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి శీరం నరసింహమూర్తి లతోపాటు నియోజకవర్గంలో ఉన్న పార్టీ నాయకులకు, మండల పార్టీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.



## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

ఆటోకు తాడుకట్టి ఆటో డ్రైవర్లు, సీఐటీయూ వినూత్న నిరసన



**అచ్యుతాపురం, (పబ్లిక్ వ్యూ) మే 16:** పెట్రోల్, డీజిల్, సీఎన్జీ ధరల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో శనివారం ఆటోకు తాడుకట్టి లాగుతూ వినూత్న నిరసన ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది రోజులకే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపిందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూనే సామాన్య ప్రజలపై ధరల భారం వేయడం అన్యాయమన్నారు.

ఇప్పటికే వంటగ్యాస్, వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలతో చిన్న వ్యాపారులు, హోటళ్లు, దాబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఇంధన ధరల పెంపుతో ఆటో కార్మికుల జీవనం మరింత కష్టాల్లో పడిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజావ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలంతా ఐక్యంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాకి అప్పలరాజు, బొండాడ ఆనంద్, రంగాల సన్యాసిరావు, శంకర్, నూకరాజు, డి. త్రినాథ్, శ్రీకాంత్, కె. రాజు, ఎస్. రమణ, నాయుడు, ఎస్. శివ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం


గ్రామాల్లో అవగాహన ర్యాలీ



**కవిటి(పబ్లిక్ వ్యూ)మే16:**మండలంలో బెలగాం పిహెచ్ సి వైద్యాధికారి పి.రాకేష్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ చేసి ప్రజలకు డెంగ్యూ జ్వరం లక్షణాలు గురించి మరియు నివారణ చర్యల గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి.రాకేష్, సూపర్వైజర్ కళావతి,ల్యాబ్ టెక్నీషియన్ బెందాళం.శివప్రసాద్,వెంకటమ్మ,పండి.రంజిత్ కుమార్ మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణిత మాయాజాలం

గణిత అవధాని మడ్డు. తిరుపతి రావు వినూత్న గణిత కథనం



**కంచిలి(పబ్లిక్ వ్యూ)మే16:**గణితం అనగానే కఠినమైన సూత్రాలు,లెక్కలతో మాత్రమే సంబంధమని భావించేవారికి, కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన గణిత అవధాని,ఉపాధ్యాయుడు మడ్డు.తిరుపతి రావువినూత్న కథనంద్వారా ఆసక్తికర సందేశాన్ని అందించారు. “కొత్త అల్లుడుముందుచూపు” పేరుతో రూపొందించిన గణితానందనం కథ ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గణితాభిమానులనుఆకట్టుకుంటోంది.భావనపాడు గ్రామానికి చెందిన రాముడు--ద్రౌపది దంపతుల కుమార్తె గాయిత్రికి ఇటీవల కోటబొమ్మాళి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు “ఏడు కొండలు”తో వివాహం జరిగినట్లు కథను రూపకల్పన చేశారు. దసరా పండుగ సందర్భంగా అల్లుడిని ఇంటికి ఆహ్వానించగా అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు ఏ రోజు వచ్చినా,ఆ తేదీ సంఖ్యకు సమానంగా అన్నిగ్రాముల బంగారం ఇవ్వాలి అని అల్లుడు కోరినట్లుగాకథసాగుతుంది. దీనితో ఆందోళన చెందిన అత్తమామలు మొదట1 గ్రాము నుంచి 31గ్రాముల వరకు మొత్తం 31బంగారు బిళ్ళలు తయారుచేయాలని భావిస్తారు.అయితే బంగారు వ్యాపారి తన గణిత ప్రతిభతో కేవలం ఐదు బిళ్ళలతోనే సమస్యకు పరిష్కారం చూపిస్తాడు.ఆ ఐదు బిళ్ళల బరువులు వరుసగా 1, 2, 4, 8,16 గ్రాములుగా ఉంటాయి.ఈ బిళ్ళలను అవసరానికి అనుగుణంగా కలిపి 1నుంచి 31వరకు ఏసంఖ్యనైనా రూపొందించవచ్చని వివరించారు. ఉదాహరణకు 7 గ్రాములు ఇవ్వాలంటే 1o2o4 గ్రాముల బిళ్ళలు,15 గ్రాములకు 1o2o4o8 గ్రాముల బిళ్ళలు, 31 గ్రాములకు ఐదు బిళ్ళలన్నింటినీ కలిపి ఇవ్వవచ్చని తెలిపారు.

సాధారణ కుటుంబ కథనం ద్వారా ద్విమాన సంఖ్యా విధానం (బైనరీ సిస్టమ్) ప్రాముఖ్యతను ఎంతో సరళంగా వివరిస్తూ రూపొందించిన ఈ గణిత కథనంవిద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా,గణితంపై ఆసక్తిని కలిగిస్తోందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

గ్రామీణ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకొని గణితాన్నిజీవితానుభవాలతో మేళవించి అందించిన ఈ వినూత్న ప్రయత్నం ప్రస్తుతం ప్రత్యేక ఆకర్షణగానిలుస్తోంది.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర పై ప్రతిజ్ఞ



**గండేపల్లి, (పబ్లిక్ వ్యూ) మే 16** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్లాస్టిక్ రహిత ఆంధ్ర రాష్ట్రంగా తయారు చేయుటకు ప్రజలకు అవగాహన కల్పించుటకు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి తద్వారా ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాలు స్వచ్ఛంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తద్వారా రాష్ట్రం స్వచ్ఛందంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి చంద్రరావు ,ఏపీవో రాజు, కార్యాలయ సిబ్బంది ,ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జన గణనపై ఎంపీడీవో పరిశీలన



**గండేపల్లి, (పబ్లిక్ వ్యూ) మే 16** మండలంలోని మల్లేపల్లి గ్రామంలో చరణ్ జనగణన నిర్వహిస్తున్న సిబ్బందిపై స్థానిక ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన గణన 100% నమోదు త్వరితగతిన పూర్తిఎందుకు సిబ్బంది కృషి చేయాలని ఆయన అన్నారు. అలాగే జన గణన పై ప్రజలకు అవగాహన కల్పించి 100% ప్రజలు జన గణనపై వివరాలు పూర్తిగా అందించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ద

# కంబాల శ్రీనివాసరావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఉపాధ్యాయ సంఘం నాయకులు



**జగ్గంపేట,( గోకవరం) (పబ్లిక్ వ్యూ) మే 16** విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, మానవతా వాది, వితరణశీలి మరియు ప్రముఖ బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాస రావు జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఘాఖూ) జిల్లా నాయకత్వం కలిసి గజ మాల, దుస్సాలువా, జ్ఞాపికతో సత్కరించారు. భవిష్యత్ లో ఉన్నత పదవులు అలంకరించి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాల ద్వారా సమాజసేవలో తరించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. చలపతి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తోటకూర.వి.వి. సత్యనారాయణ, కోశాధికారి కె. చినబాబు, శ్రీ కన్య, కె .ఎస్.ఆర్. మూర్తి, టెక్నికల్ హెడ్ బి రామకృష్ణ, ఎన్.సత్తిబాబు, జి. నగేష్, పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా" వెలగా రమేష్"



**నక్కపల్లి (పబ్లిక్ వ్యూ) మే 16** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువత ప్రధాన కార్యదర్శిగా మండలం లోని చినదొడ్డిగొల్లు గ్రామానికి చెందిన మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు కుమారుడు రమేష్ ను నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు , మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు . ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ జిల్లా నాయకత్వాన్ని అనుసరిస్తూ యువతను సన్నద్ధం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. తనను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్ ,అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ , పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి కంబాల జోగులు , రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ,మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు ,వైస్సార్సీపీ సీనియర్ నాయకులుకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఈ నెల 20న పాయకరావుపేట నియోజకవర్గ మినీ మహానాడు




**హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో మినీ మహానాడు**

**మినీ మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన నాయకులు**

**నక్కపల్లి,(పబ్లిక్ వ్యూ) మే 16** ఈ నెల 20న పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టిడిపి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు,పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి టీడీపీ నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. నక్కపల్లిలో మంత్రి నివాసం వద్ద ఉదయం 10 గంటలకు మినీ మహానాడు ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి గ్రామ కమిటీ సభ్యులతో పాటు కనీసం 30 మంది కార్యకర్తలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా, వివిధ గ్రామాల నుంచి టీడీపీలో చేరికలు కూడా ఈ సందర్భంగా నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రతి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాలని సూచించారు. మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి మినీ మహానాడును విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు మరింత కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, మాజీ వైస్ ఎంపీపీ వైభవన రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, పాయకరావుపేట మండలం అధ్యక్షుడు చించలపు ప్రదీప్, దార్ల కృష్ణ, కురం దాస్ నూకరాజు, యాళ్ల వరహాలు బాబు, తో పాటు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# చిన్నారుల్లో సృజనాత్మకతకు నాంది

**ఈ నెల 22 నుంచి "మై విజ్ ఏఐ స్మార్ట్ సమ్మర్ క్యాంప్ -- 2026"**

**భవిష్యత్ టెక్నాలజీ ప్రపంచానికి పిల్లలను సిద్ధం చేయడమే లక్ష్యం: వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, (పబ్లిక్ వ్యూ) మే 16** చిన్నారుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 22వ తేదీ నుంచి రామచంద్రపురం టౌన్ హాల్‌లో "మై విజ్ ఏఐ స్మార్ట్ సమ్మర్ క్యాంప్ -- 2026" నిర్వహిస్తున్నట్లు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ సమ్మర్ క్యాంప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఝ×) ఆధారిత విద్య, సృజనాత్మక అభ్యాసం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆలోచనా విధానాల అభివృద్ధిపై శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మే 1 నుంచి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, చెస్, డ్రాయింగ్, డాన్స్ తదితర అంశాల్లో సమ్మర్ క్యాంప్ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఆధునిక ప్రపంచంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో చిన్నప్పటి నుంచే పిల్లలకు సురక్షితమైన ఏఐ వినియోగంపై అవగాహన కల్పించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "మై విజ్" ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్యాంప్‌లో పిల్లలకు చదవడం (రీడ్), ఆలోచించడం (తింక్), సృజనాత్మకంగా రూపొందించడం (క్రియేట్) వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఝ× ద్వారా సోక్రటిక్ పద్ధతిలో నేర్చుకునే విధానాలు, విద్యలో సమాధానాలను సులభంగా అర్థం చేసుకునే పద్ధతులు, సృజనాత్మక రచనలు, ప్రాజెక్ట్ తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సురక్షితమైన ఏఐ విద్యా విధానం అందుబాటులో ఉంటుందని, భవిష్యత్ టెక్నాలజీ ప్రపంచానికి వారిని సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వాసంశెట్టి సత్యం తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లలను సమ్మర్ క్యాంప్‌లో నమోదు చేయించాలని కోరారు. ఆసక్తి గల వారు పోస్టర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా లేదా 96428 41444 నంబర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

# మంత్రి లోకేష్ పర్యటనలో స్వల్ప మార్పులు



**బహిరంగ సభకు బదులు రచ్చబండ కార్యక్రమం**

**జగ్గంపేట, (పబ్లిక్ వ్యూ) మే 16** స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 19న మంత్రి నారా లోకేష్ జగ్గంపేట నియోజకవర్గ పర్యటన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు ఆయన తెలిపారు. 19న ఉదయం 9 గంటలకు గుర్రంపాలెం రోడ్డులోని ఫామ్ ఆయిల్ తోటలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం, 10 గంటలకు తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూ.52 కోట్లతో మరమ్మతులకు శంకుస్థాపన, అనంతరం ఎంపిక చేసిన గ్రామంలో రచ్చబండ కార్యక్రమం, మధ్యాహ్నం పరిణయ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులతో సమావేశం, ఫోటోషూట్, సాయంత్రం వరకు పార్టీ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ప్రారంభంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేసినప్పటికీ, సీఎం చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపు మేరకు కార్యక్రమ స్వరూపాన్ని మార్చినట్లు ఎమ్మెల్యే వివరించారు. రైతులు, నాయకులు, కార్యకర్తలు సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై తరలివచ్చి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇంధనం పొదుపే దేశానికి మేలు అనే నినాదంతో ప్లకార్డులు చేపట్టి ప్రచారం చేస్తూ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన టీడీపీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కన్నబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షులు జీనుమణి బాబు, తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, రేఖా బుల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం






- **"స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర"లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి: జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**
- **ప్లాస్టిక్ నిషేధంపై కాకినాడలో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ కార్యక్రమం**

**కాకినాడ, (పబ్లిక్ వ్యూ) మే 16** ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కాకినాడ నగరంలోని ఆనందభారతి గ్రౌండ్స్‌లో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా "ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం" అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత జిల్లా కలెక్టర్ అందరితో స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం "ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం" అనే నినాదాలతో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా నగర ప్రజలకు పర్యావరణ హిత జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈ నెలను "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తి నిషేధం" అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గోనె సంచులు లేదా బట్ట సంచులు ఉపయోగించే పాత అలవాటును తిరిగి అలవర్చుకోవాలని ప్రజలకు సూచించారు. మన నిర్లక్ష్యంగా పారేసే ప్లాస్టిక్ సముద్రంలోకి చేరి మైక్రో ప్లాస్టిక్‌గా మారి, చేపల ద్వారా తిరిగి మన శరీరాల్లోకే చేరుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రీయ పరిశోధనలు చెబుతున్నాయని హెచ్చరించారు. ప్రతి కుటుంబం ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించేందుకు సంకల్పించాలన్నారు.

శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ, ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాలంటే ప్రజల్లో చైతన్యం, స్వీయ నియంత్రణ అవసరమని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసి ఇవ్వడం వల్ల ప్లాస్టిక్ రీసైక్లింగ్ సులభమవుతుందని చెప్పారు. ప్లాస్టిక్ విక్రయాలు, సరఫరాపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పూర్వం మాదిరిగా స్టీల్ పాత్రలు, మట్టి పాత్రలు, గుడ్డ సంచుల వినియోగాన్ని తిరిగి అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పరిశుభ్రమైన మరియు పచ్చదనంతో నిండిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్లాస్టిక్ నిషేధం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎస్ఈ పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డా. పృథ్వీచరణ్, ఈఈలు కనకారావు, అర్జున్, శానిటేషన్ సూపర్వైజర్లు నాయుడు, రాంబాబు, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు పెద్దపీట వేయాలి




'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, (పబ్లిక్ వ్యూ) మే 16 :**ప్రజారోగ్యంపై ప్రభావం చూపే ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం వీఎల్ పురంలో జిల్లా స్థాయి 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనా, స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సాధనపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రసంగిస్తూ, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఆరోగ్యానికి ఉద్దేశించినది గా భావించా లన్నారు. గతంలో క్లాత్ సంచులు, జ్యూట్ బ్యాగులు వినియోగించే వారని ప్లాస్టిక్ వినియోగం పెరిగి ఆరోగ్యానికి చేటు తెచ్చుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ వల్ల నేల, నీరు, గాలి కాలుష్యం పెరిగి పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. పరిశుభ్రత ఇంటి వరకే పరిమితం కాకూడదని పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ 'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' లో భాగంగా ఈనెల 'ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్' థీమ్ తో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరంలో రోజూ టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు . నది తీర ప్రాంతాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ కవర్లు నీటిని కలుషితం చేయడమే కాకుండా, నదీ జల వ్యవస్థను దెబ్బతీస్తు న్నాయన్నారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. . ప్రభుత్వ కార్యాలయాలలోనూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ,పర్యావరణానికి పెనుముప్పుగా తయారైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని పిలుపు నిచ్చారు. అనంతరం 'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' పోస్టర్ ను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ రహిత సంచులను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ వి. వినూత్న, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దసంఖ్యలో

## ప్రధాని మోదీ మోసాలను దేశ ప్రజలు గ్రహించాలి




-పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వర రెడ్డి

**రాజమహేంద్రవరం, (పబ్లిక్ వ్యూ) మే 16** ప్రధాని నరేంద్రమోదీ మోసాలను దేశ ప్రజలు గ్రహించాలని, ఆయన దేశాన్ని సర్వనాశనం చేసి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి మండి పడ్డారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ప్రతీ కుటుంబానికి 15 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని ఈరోజు వరకు ఒక్క రూపాయి ఎవరి ఖాతాలోనూ జమచేయ లేదన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ మోదీని విమర్శించారని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మాజీ మంత్రి పేర్ని నాని, ఎఐసిసి అధ్యక్షుడు మల్లి ఖార్జున ఖర్గేపై విమర్శ లు చేయడాన్నీ ఖండిస్తున్నా మన్నారు. బీజేపీలో ఉండి చంద్రబాబును పొడుగుతూ ఉండటమే ఆయన పని అన్నారు. చంద్రబాబు నాయుడు, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి చాలా మంది కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించి వెళ్లిపోయిన వారేనన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని అదానీ, అంబానీలకు మోడీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. 12 మంది రుణాలు తీసుకుని పారిపోతే వారికి మోదీ రూ. 34 లక్షల కోట్లు రుణమాఫీ చేసారని విమర్శించారు. వారిలో ఎక్కువ మంది గుజరాత్ కు చెందిన మోదీలే ఉన్నారన్నారు. ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్ పార్టీని దేశంలో అధికారంలోకి తీసుకుని రావాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని విజ్ఞప్తి చేసారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమని మండిపడ్డారు. కావల్సినన్నీ నిల్వలు ఉన్నాయని అంటూనే ధరలు పెంచి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. మళ్లీ వంట గ్యాస్‌తో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోవడం ఖాయమన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ప్రజలపై భారం పడకుండా పాలన సాగించాలన్నారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ నాయకులు సింధియారాణి, రాజశేఖర్, మేడవరపు భద్రం దొర, బర్రే సుబ్రహ్మణ్యం, చిన్నం మురళీకృష్ణ, కిశోర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ అవగాహన ర్యాలీ




**రాజమహేంద్రవరం, (పబ్లిక్ వ్యూ) మే 16** జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వసుంధర అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎన్ వసుంధర మాట్లాడుతూ, రానున్న వర్షాకాలంలో డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రజల్లో ముందస్తు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డెంగ్యూ నివారణకు ఇంటి పరిసరాలు, చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూడడం ముఖ్యమన్నారు. నీటి నిల్వలను తరచూ పరిశీలించడం, శుభ్రపరచడం, మూతపెట్టడం వంటి చర్యలను పాటించా లన్నారు. జిల్లా మలేరియా అధికారి సంధ్య మాట్లాడుతూ, దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వారంలో ఒక రోజు "డ్రై డే"గా పాటిస్తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్, జోనల్ మెడికల్ అధికారులు,వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


## కడియం నర్సరీ ఎక్స్పీరియన్స్ సెంటర్ పరిశీలించిన గోరంట్ల



**రాజమహేంద్రవరం (పబ్లిక్ వ్యూ) మే 16 :**కడియం మండలం కడియపులంక గ్రామంలో సాస్కీ నిధులు రూ.5.13 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న కడియం నర్సరీ ఎక్స్పీరియన్స్ సెంటర్ ను నిర్మాణ పనులను రూరల్ శాసనసభ్యులు శనివారం గోరంట్ల బుచ్చయ్య చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా టూరిజం శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అదే గ్రామంలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులు రూ.25 లక్షల రూపాయలతో ఏటిగట్టు వద్ద నూతనంగా నిర్మించే కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో పలు శాఖల అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జలధార -- జలహారతి పనులు గడువులోగా పూర్తి చేయాలి






కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, (పబ్లిక్ వ్యూ) మే 16** జిల్లాలో జలధార -- జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్లు నిరంతరం సమీక్షలు నిర్వహిం చాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఆదేశిం చారు.శనివారం విజయవాడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జలధార -- జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, డ్వామా ఇతర సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలమట్టాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న నీటి వనరులు, మైనర్ ఇరిగేషన్ చెరువుల పూడికతీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. చెరువులకు నీరు చేరే ఫీడర్ చానళ్లలో అడ్డంకులను తొలగించడంతో పాటు సాగునీటి కాలువల తూములు, గేట్ల మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి నిల్వలకు రీఛార్జ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం కింద చేపట్టే పనులన్నింటినీ నరేగా నిధులతో అమలు చేయాలన్నారు. జూన్ 30 నాటికి గరిష్ట స్థాయిలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవా లన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ జలధార -- జలహారతి లో సాగునీటి సంఘాలు, రైతులు, స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడిని నివారించడంతో పాటు వ్యవసాయ రంగానికి నీటి లభ్యత పెరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలధార -- జలహారతి కి ప్రాధాన్యత ఇస్తోందని, క్షేత్రస్థాయి పనులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఇప్పటికే 40 రోజుల సమయం పూర్తయ్యిందని, మిగిలిన 60 రోజులు కీలకమన్నారు. జిల్లాలో 1212 పనులను గుర్తించగా, 869 పనులకు మంజూరు లభించిందని, వాటిలో 543 పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. స్లూయిస్ పనులను ఇరిగేషన్ శాఖ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి. శ్రీనివాస్, డ్వామా ఏపిడీ రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులను,జీవన ఎరువులను, పశువుల ఎరువులు వర్మీ కంపోస్ట్ వాడుకోవాలి




**తాడేపల్లిగూడెం. (పబ్లిక్ వ్యూ) మే 16 .**సమతుల్య ఎరువులు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమము డాక్టర్ వైయస్సార్ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరమణ గూడెం వారు సమతుల్య ఎరువుల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ డాక్టర్ ఈ రేఖ శాస్త్రవేత్త ఉద్యాన విభాగం సమతుల్య ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రైతులకు రసాయనకి ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను,జీవన ఎరువులను, పశువుల ఎరువులు మరియు వర్మీ కంపోస్ట్ వాడుకొనమని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగం వలన మట్టిలో పోషక సమతుల్యత దెబ్బతింటుందని సూచించారు. భూసార పరీక్షలను చేయించుకొని వాటి ఫలితాల ద్వారా ఎరువులను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 50 మంది రైతులు పాల్గొన్నారు.

## అమ్మపాలెం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణఆంధ్ర కార్యక్రమం.



**ఏలూరు (పబ్లిక్ వ్యూ) మే 16** పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామంలో ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణఆంధ్ర అనే ప్రతిస్టాత్మక కార్యక్రమం జరిగింది.ప్లాస్టిక్ బ్యాగ్స్ వద్దు. జూట్ బ్యాగ్స్ ముద్దు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్ వద్దు. స్టీల్ వాటర్ బాటిల్ ముద్దు,ప్లాస్టిక్ వాడకు. ప్రాణాలు తియాకు,ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదాలతో గ్రామంలో ప్రజలకి అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ షరీఫ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి అధికారి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుటలో కూటమి నాయకులుతో కలిసి,కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగానే శాసనసభ్యుల ఆదేశాల మేరకు,గ్రామాన్ని ప్లాస్టిక్ రహితగ్రామం కొరకు ప్రజలందరి తో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పి.వీరయ్య, చందు.గంగాధరరావు, పామర్తి.శ్రీనివాసరావు,జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు వై.లక్ష్మణరావు, స్వర్ణ గ్రామం సిబ్బంది సంక్షేమసహాయకులు, మురళి,డి.ఏ-తేజ, విహెచ్ఏనిరంజన్,మాధవి,శిరీషా,గుమస్తా -యం.కామేష్ స్వచ్ఛందంగా గ్రామప్రజలు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు మంచి రోజుల...

- మంచి రోజులు ఎలా వచ్చాయి
- సిపిఎం ప్రశ్న
- నిర్వాసితులకు చట్టబద్ధమైన హక్కును కల్పించాలి



**కూనవరం, (పబ్లిక్ వ్యూ) మే 16** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం నిర్వాసితులకు మంచి రోజులు వచ్చాయని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య విమర్శించారు.మార్త శ్రీ రామ్మూర్తి భవన్ లో ఆవుల ఉపేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో కొందరు చంద్రబాబు వచ్చాకే మంచి రోజులు వచ్చాయని చెప్పడం సబబు కాదని వారు అన్నారు.2013 భూ సేకరణ, పునరావాస చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తి స్థాయి పరిహారం,పునరావాస ప్యాకేజీలు ఇప్పటికీ అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కూనవరం మండలంలోని 48 ముంపు గ్రామాలలో కేవలం 10గ్రామాలకు మాత్రమే ప్యాకేజీ ప్రకటించడం అన్యాయమని అన్నారు.మిగతా గ్రామాల ప్రజలు ఇంకా నిరీక్షణలోనే ఉన్నారని తెలిపారు.ముంపు ప్రాంతాల పేరుతో గ్రామాల్లో రహదారులు,ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయకపోవడం,వరదల సమయంలో నష్టపోయిన కుటుంబాలకు తగిన సాయం అందించకపోవడం,కొన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. 2007,2008 సంవత్సరాల్లో భూ ప్యాకేజీ పొందిన గిరిజన రైతులకు ఇప్పటికీ భూమికి భూమి ఇవ్వకపోవడం,పునరావాసప్యాకేజీలు పూర్తిగా అందించకపోవడం, ముంపులో ఉన్న భూములకు సరైన పరిహారం చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యమనిఆరోపించారు.

ఒకటిగా ఉన్న గ్రామాలను రెండుగా విభజించి కొంతమందికే ప్యాకేజీలు ఇవ్వడం సరికాదన్నారు. ఉదాహరణగా పెద్దార్కూర్ గ్రామాన్ని ప్రస్తావించారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి నిర్వాసితునికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని,పునరావాస కాలనీలకు వెళ్లే సమయానికి 18ఏళ్లు పూర్తిచేసుకున్న ప్రతి ఒక్కరినీ అర్హులుగా గుర్తించాలని కోరారు.పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి,చట్టబద్ధమైన హక్కులను పూర్తిగా అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు,బాబు బొర్రయ్య, నాగమణి,ఎంపీటీసీ అమ్మాజి, తాళ్లూరి శ్రీనివాసరావు,కర్నాటి శ్రీనివాసరావు,ఆవుల మురళి, పాయం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కొత్త ప్రచారం




పబ్లిక్ వ్యూ డెస్క్: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 -24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మబడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.

**పెమ్మసాని ప్లాన్ తో గుంటూరు...**

గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్‌ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు. వినియోగదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# సౌత్ పై జనసేన ఫోకస్...




పబ్లిక్ వ్యూ డెస్క్: జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్‌ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్‌కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

# అమరావతికి యుద్ధ గండం...

పబ్లిక్ వ్యూ డెస్క్: ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బతినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది. అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద తలనొప్పిగా మారింది. రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్ఠగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది.

## స్ట్రాటిజిస్ట్ లుకాదు.. అస్ట్రాలిజిస్ట్స్

పబ్లిక్ వ్యూ డెస్క్: రాజకీయాల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు వ్యూహకర్తలు ఇచ్చే డేటా కంటే, గ్రహగతులు మార్చే జ్యోతిష్యుల పైనే రాజకీయ నేతలు ఎక్కువ నమ్మకం పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల తమిళనాడులో విజయ్ విజయం వెనుక జ్యోతిష్యుడి హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. చండీగఢ్‌కు చెందిన ప్రముఖ ఆస్ట్రాలజర్ రుద్ర కరణ్ ప్రతాప్ ప్రత్యేకంగా తాడేపల్లికి వచ్చి జగన్‌తో భేటీ కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో ఐప్యాక్ వంటి వ్యూహకర్తలను నమ్ముకున్న జగన్, ఈసారి మాత్రం గ్రహబలంపైనే భారం వేసినట్లు కనిపిస్తోంది. చండీగఢ్ నుంచి రుద్ర కరణ్ ప్రతాప్‌ను ప్రత్యేకంగా తాడేపల్లికి రప్పించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా జ్యోతిష్యం చెప్పడంలో రుద్ర కరణ్ సిద్ధహస్తుడని పేరుంది. తన పర్యటనకు సంబంధించిన వివరాలను సదరు జ్యోతిష్యుడు సోషల్ మీడియాలో స్వయంగా పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిజానికి, 2024 ఎన్నికల్లో జగన్ ఘనవిజయం సాధిస్తారని రుద్ర కరణ్ ప్రతాప్ గతంలోనే జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. అయినప్పటికీ, జగన్ ఆయనపై నమ్మకం కోల్పోకుండా మళ్ళీ పిలిపించి చర్చలు జరపడం గమనార్హం. కేవలం రాజకీయ భవిష్యత్తే కాకుండా, ప్రస్తుతం ఎదుర్కొంటున్న న్యాయపరమైన చిక్కులు, వ్యక్తిగత జాతక దోషాల నివారణ కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. స్ట్రాటజిస్టులు ఇచ్చే లెక్కలు ఒక్కోసారి తప్పవచ్చు కానీ, సరైన జ్యోతిష్యుడి సాయంతో గ్రహాలను అనుకూలం చేసుకోవచ్చని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి రావడానికి ఆయన వ్యక్తిగత జ్యోతిష్యుడు ఇచ్చిన సలహాలే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విజయ్ ఫార్ములా ను చూశాక, జగన్ కూడా పొలిటికల్ స్ట్రాటజిస్టుల కంటే ఆస్ట్రాలజిస్టులే బెటర్ అనే ముగింపుకు వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే తాడేపల్లి ప్యాలెస్‌లో ఇప్పుడు పొలిటికల్ డేటా కంటే, జాతక చక్రాలు, గ్రహాల సంచారంపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయి. జ్యోతిష్యుడి సలహాలు జగన్ జాతకాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.

## భారీ మెజార్టీపై నేతలు కన్ను

పబ్లిక్ వ్యూ డెస్క్: టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఏఏ మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం

పబ్లిక్ వ్యూ డెస్క్: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి. ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది. తాజాగా బుధవారం 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా... వారికి కేవలం 8 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సరికొత్త రికార్డు నమోదు చేసింది. అంటే.... గంటకు 10 వేల మంది చొప్పున స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. గతంలో ఇదే 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాలంటే 18 నుంచి 24 గంటల సమయం పట్టేది. ఇప్పుడు ఐసీసీసీ వల్ల కేవలం ఓ గంటలోనే 10 వేల మందికి స్వామి వారి దర్శనం లభిస్తోంది. కేవలం అతి స్వల్ప వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభిస్తున్న నేపథ్యంలో తిరుమలలో విడిది గదులను బుక్ చేసుకుంటున్న భక్తులు.. దర్శనం వెంటనే వాటిని ఖాళీ చేస్తున్నారు. ఫలితంగా తిరుమల కొండపై విడిది గదుల కొరత అన్న సమస్యల ఉత్పన్నం కావడం లేదు. స్వామి వారి దర్శనం కోసం వస్తున్న దాదాపు అందరు భక్తులకూ విడిది గదులు లభిస్తున్నాయని చెప్పాలి. గతంలో అయితే గదుల కోసం భక్తులు సుదీర్ఘ కాలం పాటు వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు త్వరితగతిన దర్శనాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గదుల లభ్యత కూడా బాగా పెరిగింది.

## దువ్వాడ లెక్క ఏంటీ

పబ్లిక్ వ్యూ డెస్క్: పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు. ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్‌నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది. ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది. కానీ, అలాంటిదేమీ లేదు ఇటు వైపు చూసుకుంటే టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ముందు దువ్వాడ తేలిపోతున్నారు. రాజకీయ పరంగా చూసుకున్నా.. వ్యక్తిగతంగా చూసుకున్నా.. రామ్మోహన్ ముందు దువ్వాడ ఎక్కడా సమ ఉజ్జీ కాదన్న వాదన ఉంది. గతంలో ఎప్పుడోపోటీ చేసినప్పుడు భారీ ఓట్లు వచ్చాయని అనుకున్నా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో దువ్వాడ చిందులు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు.. దువ్వాడకు చేదు అనుభవమే అవుతుందని అంటున్నారు.

# ఇండిపెండెంట్ మ్యూజిక్‌తోనూ అద్భుతాలు!



అవ్నీత్ కౌర్: గ్లామర్ మరియు ప్రతిభను మిళితం చేసిన రైజింగ్ స్టార్





పూజిత పొన్నాడ యొక్క ప్రకాశవంతమైన కొత్త లుక్ సోషల్ మీడియాలో హృదయాలను గెలుచుకుంది

డిజిటల్ యుగంలో సక్సెస్ అవ్వడానికి ట్యాలెంట్ ఉంటే చాలు. ప్రత్యేకించి సినిమా రంగంలో స్థిరపడాలనుకునే వారికి డిజిటల్ మాధ్యమాలు ఎంతగా దోహదపడుతున్నాయో తెలిసిందే. ట్యాలెంట్ ను ప్రూవ్ చేసుకుంటూ ఒక్క వీడియో చేస్తే చాలు.. అది చేరాల్సిన వారికి చేరితో ప్రతిభను గుర్తించి పిలిచి మరీ అవకాశాలిస్తోన్న రోజులివి. ఈ మధ్య కాలంలో అలా వెలుగులోకి వస్తోన్న సంగీత దర్శకుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. ఇండిపెండెంట్ సంగీతానికి కూడా శ్రోతలను విశేషంగా అలరిస్తోంది. ఈ క్రమంలోనే ప్రముఖ సింగర్ కయాన్ ఇండిపెండెంట్ మ్యూజిక్ సాధిస్తున్న పురోగతి గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. స్వతంత్ర సంగీతానికి అద్భుతమైన సమయం నడుస్తోంది. గతంలో సినిమా పాటల నీడలో మరుగున పడిపోయిన ఇండిపెండెంట్ కళాకారులకు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు లభిస్తోందన్నారు. –మనం ఇప్పుడు గ్లోబల్ విలేజ్‌లో ఉన్నాం. ఇక్కడ సంగీతం ఒక ప్రాంతానికే పరిమితం కాదు. ఆధునిక బీట్స్ కలయికతో వస్తోన్న పాటలను ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్నారన్నారు. ఇలాంటి ఎలాంటి ఒత్తిళ్లకు గురవుతున్నారో కూడా వివరించారు. సింగర్‌ను , మ్యుజీషియన్‌ను ఒకే రకమైన శైలికి పరిమితం చేయాలని చూడటం సరికాదని కయాన్ అన్నారు. తాను ఎప్పుడూ రొటీన్ పద్ధతులకు లొంగిపోలేదని నచ్చిన రీతిలో ప్రయోగాలు చేయడానికే ఇష్టపడతానన్నారు. ఇండస్ట్రీ నిర్దేశించిన ఫార్ములాలను పాటించకుండా స్వంత అభిరుచితో చేసినప్పుడే నిజమైన కళాఖండాలు పుడతాయని కయాన్ వెల్లడించారు. కానీ స్వతంత్ర కళాకారిణిగా నిలదొక్కుకోవడం అంత సులభం కాదన్నారు. ఇందులో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. వాటిని అధిగమించి ప్రయాణం చేయాల్సి ఉంటుందుందన్నారు. కానీ ప్రేక్షకుల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే? ఎలాంటి ఒత్తిళ్లు అయినా దాటొచ్చు. ఒక్క సక్సెస్ ఎంతో ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. మారుతోన్న కాలానికి అనుగుణంగా శ్రోతలు కూడా కొత్త తరహా సంగీతాన్ని ఆస్వాదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఇది తమలాంటి యంగ్ మ్యుజీషియన్లకు పెద్ద వరమని కయాన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతీయ స్వతంత్ర సంగీతం ప్రత్యేక అస్తిత్వాన్ని సృష్టించుకుందని అంతా నమ్ముతున్నారు. వెస్ట్రన్ మ్యూజిక్‌ను అనుకరణతో పాటు, మూలాలను మర్చిపోకుండా కొత్తదనాన్ని జోడించడం వల్లే ఇండి మ్యూజిక్ ముమెంటం అందుకుందన్నారు. భవిష్యత్తులో ఈ రంగం మరిన్ని శిఖరాలను అధిరోహిస్తుందని సినిమా సంగీతంతో సమానంగా ఇండి మ్యూజిక్ కూడా రాజ్యమేలుతుందని అభిప్రాయపడ్డారు. కయాన్ వంటి కళాకారులు చూపిస్తున్న తెగువ , సృజనాత్మకత భారతీయ సంగీత రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది.

# ఫైనల్‌కి దూసుకెళ్లిన సాత్విక్- చిరాక్ జోడి..



**పబ్లిక్ వ్యూ డెస్క్:** థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్–500 టోర్నమెంట్ లో భారత స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్– చిరాగ్‌శెట్టి అద్భుత ప్రదర్శనలు కనబరుస్తోంది. ఈరోజు (2026, మే16న) ఉత్కంఠభరితంగా కొనసాగిన సెమీ ఫైనల్ పోరులో మలేషియా జోడీ గో జెఫీ–నూర్ ఇజ్జుద్దీన్‌పై 19--21, 22–20, 21–16 తేడాతో సాత్విక్ - చిరాక్ ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఈ సీజన్‌లో తొలి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న జోడీగా అవతరించింది.

ప్రపంచ నంబర్ 4 ర్యాంక్‌లో ఉన్న ఇండియన్ జోడీ 19–21, 22–20, 21–16 తేడాతో మలేషియాపై గెలిచింది. గంటా 22 నిమిషాల పాటు జరిగిన ఈ ఫైట్ లో సాత్విక్ –– చిరాక్ జోడీ అద్భుత పోరాట పటిమ కనబరిచారు. ఈ గెలుపుతో మలేషియా జోడీపై తమ హెడ్–టు–హెడ్ రికార్డును 8–2కు పెంచుకుంది. పీవీ సింధు, లక్ష్యసేన్ ఇప్పటికే ఈ టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ.. భారత్ ఆశలన్నీ ఈ జోడీపైనే నెలకొన్నాయి. కాగా తొలి సెట్‌ను మలేషియా ఆటగాళ్లు గో జెఫీ– నూర్ ఇజ్జుద్దీన్ 20--19 తేడాతో కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న ఇండియన్ జోడీ రెండో సెట్‌ను 22–20తో దక్కించుకుంది. మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో గెలుపు కోసం ఇరు జట్లూ తీవ్రంగా కష్టపడ్డాయి. కానీ సాత్విక్– చిరాక్ జంట అద్భుతమైన ప్రదర్శనతో 21- 16తో సెట్‌ను గెలిచి.. ఫైనల్‌కు దూసుకుపోయింది.

# కేకేఆర్ వర్సెస్ గుజరాత్ మ్యాచ్‌కు వర్షం గండం.. వెదర్ రిపోర్ట్ ఇదే!





**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఐపీఎల్ 2026 లీగ్ దశ ముగింపుకు వస్తుండటంతో ప్రతీ మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారుతోంది. కాసేపట్లో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య జరగబోయే మ్యాచ్‌కు వాతావరణం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే కేకేఆర్‌కు తమ మిగిలిన మూడు మ్యాచుల్లోనూ గెలవడం అత్యంత కీలకం కాగా.. ఇలాంటి టైమ్‌లో వర్షం పడి మ్యాచ్ రద్దయితే కోల్‌కతా ఆశలు గల్లంతవుతాయి.

**కోల్‌కతా ప్రస్తుత వాతావరణం:**

ప్రస్తుతానికి కోల్‌కతాలో వర్ష సూచనలు పెద్దగా లేవు. మ్యాచ్ ప్రారంభ సమయానికి నగరం అంతటా అక్కడక్కడా చెదురుమొదురుగా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వర్షం కంటే కూడా ప్రస్తుతం కోల్‌కతాలో ఉన్న విపరీతమైన వేడి, ఉక్కపోత ఆటగాళ్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టేలా ఉంది. ఇలాంటి క్లైమేట్‌లో ప్లేయర్స్ తమ ఎనర్జీని కాపాడుకోవడం సవాలుతో కూడుకున్నది. ఇక మ్యాచ్ జరిగే సమయంలో వర్షం పడేందుకు దాదాపు ఎలాంటి అవకాశాలు లేవని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

**అధిక ఉష్ణోగ్రతలు:**

సాయంత్రం వేళల్లో హ్యుమిడిటీ (తేమ) 70 నుంచి 80 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. దీనివల్ల మొదటి ఇన్నింగ్స్ సమయంలో 'ఫీల్స్ లైక్' (ఉష్ణోగ్రత తీవ్రత) ఏకంగా 42°C (109°F) గా నమోదయ్యే ప్రమాదం ఉంది. ఇది ఆటగాళ్లకు తీవ్రమైన చెమట, అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**పిచ్ రిపోర్టు:**

ఐపీఎల్ 2026లో ఈడెన్ గార్డెన్స్ పిచ్ సాధారణం కంటే కాస్త స్లోగా కనిపిస్తోంది. ఇది అటు పేసర్లు, ఇటు స్పిన్నర్లు ఇద్దరికీ సమానంగా సహకరిస్తోంది. కొత్త బంతితో పేసర్లకు ల్యాటరల్ మూవ్‌మెంట్, బౌన్స్ లభిస్తుండగా.. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లకు పిచ్ నుంచి మంచి గ్రిప్, టర్న్ దక్కుతోంది. బంతి ఒక్కసారి ఇన్‌ఫీల్డ్ దాటిందంటే మెరుపు వేగంతో బౌండరీకి దూసుకెళ్తుంది.

**వర్షం పడే ఛాన్స్ తక్కువ:**

గత కొన్ని రోజులుగా కోల్‌కతాలో పెద్దగా వర్షాలు పడలేదు. ఈ రోజు (మే 16) వర్షం పడే అవకాశాలు ఉన్నట్లు ఉదయం సూచించినప్పటికీ, మ్యాచ్ జరిగే సమయానికి ఎలాంటి అంతరాయం ఉండకపోవచ్చని తాజా వెదర్ రిపోర్ట్స్ స్పష్టం చేస్తున్నాయి. కాబట్టి క్రికెట్ ఫ్యాన్స్‌కు పూర్తి 40 ఓవర్ల హైవోల్టేజ్ మ్యాచ్ ఎంటర్‌టైన్‌మెంట్ లభించడం పక్కా!.

# ఆ ఒక్క తప్పుతోనే లక్నో చేతిలో ఓటమి.. ప్లేఆఫ్స్ రేసును సంక్లిష్టం చేసుకున్న CSK



**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఐపీఎల్ 2026 సీజన్ చివరి దశకు చేరుకున్న వేళ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకి ఊహించని షాక్ తాకింది. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే నిష్క్రమించి, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతున్న లక్నో సూపర్ జెయింట్స్ ) చేతిలో చెన్నై ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ ఓటమితో సీఎస్కే పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోవడమే కాకుండా, తమ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత కఠినతరం చేసుకుంది.

**జట్టు ఎంపికలో తప్పిదాలు:**

కీలకమైన మ్యాచులో చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు జట్టు కొంపముంచాయని మాజీ క్రికెటర్లు అభిప్రాయ పడుతున్నారు. గాయపడిన జేమీ ఓవర్టన్ స్థానంలో స్పెన్సర్ జాన్సన్‌ను టీమ్ లోకి తీసుకున్నారు. కానీ లక్నో పిచ్ పరిస్థితుల దృష్ట్యా అద్భుతమైన ఫాంలో ఉన్న స్పిన్నర్ అకీల్ హుసేన్ ని పక్కన పెట్టడం మైనస్‌గా మారింది. మరో స్పిన్నర్ నూర్ అహ్మద్ ఒకవైపు రన్స్ ని కట్టడి చేసినా, అతనికి తోడుగా అకీల్ హుసేన్ ఉండి ఉంటే (కనీసం ఇంపాక్ట్ ప్లేయర్‌గా) లక్నో బ్యాటర్లపై ఒత్తిడి పెంచే ఛాన్స్ ఉండేది.

**అన్షుల్ కాంబోజ్ చెత్త రికార్డు!:**

ఈ సీజన్‌లో సీఎస్కే తరఫున అత్యధిక వికెట్లు తీసి, పర్పుల్ క్యాప్ రేసులో దూసుకుపోతున్న అన్షుల్ కాంబోజ్ కి లక్నోతో జరిగిన మ్యాచ్ ఒక పీడకలగా మిగిలిపోయింది. ఎల్ఎస్‌జీ బ్యాటర్లు అతడిని పూర్తిగా టార్గెట్ చేశారు. ఇన్నింగ్స్ 5వ ఓవర్ వేసిన కాంబోజ్ బౌలింగ్‌లో మిచెల్ మార్ష్ ఏకంగా 4 సిక్సర్లు కొట్టాడు. అలాగే 17వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన కాంబోజ్‌ను నికోలస్ పూరన్ ఓ ఆట ఆడుకున్నాడు. మొదటి 4 బంతుల్లోనే 4 సిక్సర్లు కొట్టి మ్యాచ్‌ను కంప్లీట్ చేసేశాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే ఒకే మ్యాచ్‌లో, రెండు వేర్వేరు ఓవర్లలో నాలుగేసి సిక్సర్లు (మొత్తం 8 సిక్సర్లు) సమర్పించుకున్న ఏకైక బౌలర్‌గా కాంబోజ్ చెత్త రికార్డుని మూటగట్టుకున్నాడు. కేవలం 2.4 ఓవర్లలోనే 63 రన్స్ సమర్పించి సీఎస్కే ఓటమికి కారణమయ్యాడు.

**సీఎస్కే ప్లేఆఫ్స్ సమీకరణాలు:**

ప్రస్తుతం 12 మ్యాచులు ఆడిన చెన్నై 6 విజయాలు, 6 ఓటములతో పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతుంది. చెన్నై ఇంకా 2 లీగ్ మ్యాచులు ఆడాల్సి ఉంది. మే 18: సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)తో రసవత్తర పోరు ఉండగా.. మే 21: గుజరాత్ టైటాన్స్ (GT)తో చివరి లీగ్ మ్యాచ్ ఆడబోతుంది.

**సీఎస్కే ప్లేఆఫ్స్ చేరాలంటే?:**

చెన్నై సూపర్ కింగ్స్ కచ్చితంగా ఈ రెండు మ్యాచుల్లోనూ భారీ రన్‌రేట్‌తో గెలవాల్సి ఉంది. అలా గెలిచినా కూడా ఇతర జట్ల (ముఖ్యంగా టాప్–4 రేసులో ఉన్న జట్లు) గెలుపోటములపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇందులో ఒక్క మ్యాచ్ ఓడినా చెన్నై ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతయినట్లే!.. టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

On behalf of Published and owned by CHIRIKI LOKESWARA RAO , Published at D.NO: 12-132, B.C. COLONY, VILLAGE PARAWADA, POST & MANDAL, ANAKAPALLI DIST, ANDHRA, ANDHRAPRADESH -531021. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, FLAT.NO: 504, BHARAT TOWERS, 5TH LANE, DWARAKA NAGAR, DISTRICT VISAKHAPATNAM, ANDHRAPRADESH-530018. Editor: CHIRIKI LOKESWARA RAO, (Responsible for selection of news under the PRB Act ) PRGI No: APTEL/2023/88653